


# కోరి పిల్లనడిగితే!

## అమృత

చిన్న చేతి సంచిలో రెండు చీరలు పెట్టుకుని పొద్దున్నే ఎనిమిది గంటల వేళ అన్నగారి యింటి ముందు రిక్షా దిగింది పంకజమ్మ.

అప్పుడే నిద్ర లేచి కాఫీ తాగుతూ, పేపరు చూస్తూ ముందు గదిలోనే కూర్చుని వున్న గోవిందరాజే మొదట చెల్లెల్ని చూశాడు.


వెంటనే పేపరు కాఫీ కప్పూ పక్కన పెట్టేసి, లేచి చెల్లెలికి సాదరంగా ఎదురు వస్తూ, "రామ్మా, అంతా కులాసాయేనా?" అంటూ ఆప్యాయంగా ప్రశ్నించాడు.

గుమ్మంలో అడుగు పెట్టగానే ఎదురైన మొదటి కుశల ప్రశ్నకి, తొలి స్వాతి చినుకు పడిన ముత్యపు చిప్పలా తళతళ లాడింది పంకజమ్మ ముఖం. "అంతా బాగున్నా మన్నయ్యా! నీ ఒంట్లో కులాసాగా వుంటోందా?" – అంది.

"ఓ, నాకేం? నిక్షేపరాయుడిలా వున్నాను! పద లోపలికి! అవునూ, బావగారు రాలేదేం?" ఎవరూ తోడు లేకుండా ఒక్కర్తెవే వచ్చావు–"

అన్నగారి ప్రశ్న వినగానే పంకజమ్మ మొహం క్షణకాలం చిన్నబోయింది.

"నీ వెర్రి గాని. మీ వదిన నీ కోరికని సాగనిస్తుందన్న నమ్మకం నాకేం లేదే! మీ అన్న మంచివాడే కావచ్చు! కాని, యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం లేనివాడు! అయినా నీకింకా ఆశ చావలేదు గాబట్టి ప్రయత్నానికి నువ్వొకర్తివి వెళ్ళిరా! నేను మాత్రం రాను" అంటూ ఖచ్చితంగా భర్త చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.



తేరుకుంటూ ఏదో చెప్ప బోయింది పంకజమ్మ. ఇంతలో అలికిడి విని "అత్త వచ్చింది" "అత్త వచ్చింది" అంటూ మేనగోడళ్ళు సునీతా, కవితా, మేనల్లుడు వెంకటేష్ చుట్టు ముట్టటంతో తేలిగ్గా వూపిరి పీల్చుకుని, వాళ్ళని పలకరిస్తూ, తను చేసి తెచ్చిన పాలకోవా తీసి యిచ్చింది!

ఈ లోగా లోపల్నించి సీతమ్మ కూడా వచ్చి ఆడబడుచుని పలకరించి కాఫీ తెస్తానంటూ వెళ్ళింది.

పిల్లలు ఎవరి పనిమీద వాళ్ళు వెళ్ళేరు! లోపలికి నడవ బోయిన పంకజమ్మ వంటింట్లోంచి వినబడుతున్న మాటలు విని చప్పున ఆగిపోయింది.

"ఏమిటీ, చెల్లెలికి హఠాత్తుగా అన్నగారి మీద ప్రేమ పుట్టుకొచ్చినట్టుంది?" వెటకారంగా అంటూంది సీతమ్మ.

"ష్... నెమ్మది! ఏమిటా మాటలు? పంకజానికి నేనంటే ఎప్పుడూ అభిమానమే..." గోవిందరాజు ఆప్యాయంగా అంటున్నాడు.

"మీ అన్నా చెల్లెళ్ళిద్దరూ ఎంతటి ప్రేమలైనా ఒలక బోసుకోండి. నాకేం గాని, నా పిల్లల జోలికి మాత్రం రావద్దు!" ఖచ్చితంగా వుంది సీతమ్మ స్వరం.

"అబ్బ, ఎన్ని సార్లు చెబుతావే ఆ మాట? నీ పిల్లల విషయంలో నీ యిష్టం లేనిదే ఏమీ చెయ్యనని యిప్పటికి లక్ష సార్లు చెప్పాను! ఇంకో లక్ష సార్లు కావాలంటే చెబుతాను! ముందు వెళ్ళి దానికి కాస్త కాఫీ యియ్యి!" గోవిందరాజు పెరట్లోకి వెళుతున్న సవ్వడి వినిపించింది.

"ఇప్పుడిలాగే అంటారు! తీరా చెల్లెలు నాలుగు కమ్మని మాటలు చెప్పేసరికి జావ కారిపోతారు! మీ మెతకతనం నాకు తెలీదూ?" సీతమ్మ గొణుక్కుంది.

బైట నించి వింటున్న పంకజమ్మ తను వచ్చిన పని సగం అయిపోయినట్టుగా గాఢంగా నిట్టూర్చింది! మళ్ళీ క్షణంలో తనని తనే కూడ గట్టుకుంది! వదినగారి సంగతి తనకి తెలియనిదేముంది? పైపై భేషజాలకి, ఆడంబరాలకి విలువ నిచ్చే మనిషి! పల్లెటూరి జీవితం అంటే నరక ప్రాయంగా చూస్తుంది! వండుకుంటే గ్యాస్ స్టౌ మీద కుక్కరు పెట్టి వండాలి లేకపోతే పస్తులు పడుకుని చావాలి అనే రకం! ఈవిడ యిష్టాయిష్టాలకి, నిర్ణయాలకి సంసారాన్ని వదిలేస్తే, అన్నయ్య జీవితం కీకారణ్యంలో దారి తప్పిన పసివాడి చంద మవుతుంది! ఆవిడ ఏమన్నా సరే, తను చెప్పదల్చుకున్న దేదో అన్నయ్యకి చెప్పే వెళ్ళాలి! ఆ పైన అంతా భగవదేచ్ఛ!

ఇలా నిర్ణయించుకున్న పంకజమ్మ స్థిరంగా వంటింట్లోకి అడుగు పెట్టి, చిరునవ్వుతో వదినగారి చేతుల్లోని కాఫీ కప్పు అందుకుంది.

ఆ రోజు ఆదివారం కావటం చేత స్పెషల్గా గారెలూ, సేమ్యా చేసింది సీతమ్మ. పంకజమ్మ కూడా వదినగారి కూడా కూడా తిరుగుతూ సాయపడింది!

అందరి భోజనాలూ అయేటప్పటికి పన్నెండు దాటింది!

భోజనాలయాక, మధ్య హాల్లో తాంబూలపు సరంజామా పెట్టుకుని, పెద్ద వాళ్ళు ముగ్గురూ తాపీగా కబుర్లలోకి దిగారు.

కాసేపు ఏదో లోకాభి రామాయణం అయాక, "అన్నయ్యా, నీతో ఒక చిన్న పనుండి వచ్చాన్రా!" అంది పంకజమ్మ.

ఆ మాట వింటూనే సీతమ్మ కనుబొమలు ముడి పడ్డాయి!

గోవిందరాజు మాత్రం మామూలుగానే, "ఏమిటమ్మా?" అని ప్రశ్నించాడు.

"మరేం లేదు! మన వాసుకి ఈ ఏడాది పెళ్ళి చేసెయ్యాలని నేనూ మీ బావగారూ అనుకుంటున్నాం! వాడూ పెళ్ళికి సుముఖంగానే వున్నాడు! వాడికి సునీత నిచ్చి చేస్తే బావుంటుందని మా కోరిక! ఎవరో పై పిల్లని కోడలిగా తెచ్చుకునే కంటె నీ పిల్లే అయితే అరమరిక లేకుండా కలిసి పోతుంది! మేనత్తని, నీ కూతుర్ని కడుపులో పెట్టుకుని కాపాడుకుంటాను! ఏమంటావ్?"

గోవిందరాజు చప్పున ఏమి చెప్పలేనట్టుగా భార్య వైపు చూశాడు!

సీతమ్మ ముఖం అప్పటికే ధుమధుమ లాడుతోంది!

భర్త తనవైపు చూడగానే, "ఎలా యిస్తామండీ, ఇంటర్మీడియట్ మెట్లు కూడా ఎక్కలేక, ఆ పల్లెటూళ్ళో వున్న కాస్త పొలం పట్టుకుని గొర్రె తోక బెత్తెడన్నట్టు బతుకుతున్నాడా కుర్రాడు! అలాంటి వాడికి పిల్లనిస్తే అది మన ప్రాణానికి ఉసూరు మంటూ బతకాలి!" అంది.

వదినగారు అంత డైరెక్ట్గా మాట్లాడుతుందని ఊహించని పంకజమ్మ, ఒక్క

క్షణం సీతమ్మ మాటలకి చిన్నబుచ్చు కుంది!

వెంటనే తేరుకుంటూ, హాస్యంగా, "నా కొడుక్కి చదువు లేదు. నిజమే! కాని అర్హతానర్హతలు చూసుకోకుండా రాలేదమ్మా వదినా, నేను! నీ కూతురు పదో క్లాసు ఎన్నిసార్లో గుంజీలు తీసి పేస్సె, చివరికి చదువుకో దండం పెట్టేసి యింటి పట్టున కూర్చున్న మాట మర్చిపోయావా, ఏం?" అంది.

కూతురి చదువు ప్రసక్తి రాగానే సీతమ్మ ముఖం క్షణకాలం నల్లబడింది!

వెంటనే, "లేదులేవమ్మా! కాని అది ఆడది! మొగుడు వీధిలో కెళ్ళి సంపాదించి తెచ్చి పోస్తుంటే పిల్లల్ని కని, సంసారం నడపటానికి దానికి ఆ మాత్రం చదువు చాలు! కాని నీ కొడుకు సంగతో? అతగాడికి వచ్చిన విద్యతో పెళ్ళాన్ని పిల్లల్నీ ఏ అందలం ఎక్కిస్తాడూ అంట?" అంది.

సీతమ్మ మాటలకి పంకజమ్మ బాధ పడలేదు! "వదినా, అన్ని జీవితాలూ అందలాలే ఎక్కవమ్మా! నేల జారు జీవితాలూ వుంటాయి! సృష్టిలో ప్రతి మనిషీ అందగాడూ, విజ్ఞానీ, ధనవంతుడూ అయివుంటే యిక యిన్ని చరిత్ర లెందుకు, యిన్ని రక్తపాతా లెందుకు? అవేమీ లేనంత మాత్రాన జీవితం వ్యర్థమే నంటావా? నా కొడుకు అనాకారి కాడు! వాడికి ఒంట్లో వేప

## కోరి పిల్లనడిగితే...

వుంది, రోగిష్టి మనిషేమీ కాడు! వున్న కండల్ని కరిగిస్తాడు. తానింత తింటాడు పెళ్ళాం పిల్లల కింత పెడతాడు! అన్నయ్యకి మాత్రం ఆస్తిపాస్తులు ఏం వున్నాయని? ఇన్నాళ్ళయింది, ఉండటానికి ఓ కొంప నిలబెట్టుకో లేక పోయారు! ఇప్పుడు లేని పరుగులకి పోయి, ఉన్నదేదో ఆడపిల్లల కింద పెట్టేసి తర్వాత దిక్కూ దివాణం లేకుండా బతుకుతారా? నీ మంచీ అన్నయ్య మంచీ కోరి యింతదూరం చెబుతున్నాను-- విను! సునీతని మా వాడికిచ్చి చెయ్యండి! మాకు పైసా కట్నం, కానుకలు అక్కర్లేదు! కవితకి అయినంతలో మంచి సంబంధం చూసి చెయ్యండి! మీకున్న కొద్దో గొప్పో డబ్బు పెట్టి కాస్త స్థలం ఎక్కడైనా కొనుక్కొని యిల్లు కట్టుకోండి! అందని ఎత్తుకి ఎగరటానికి ప్రయత్నించి నడవటానికి కూడా లేకుండా ఉన్న కాళ్ళు విరక్కొట్టుకోకండి!"

ఆడబడుచు మాటలకి మూతి తిప్పింది సీతమ్మ. పిల్లల బతుకులు అధ్వాన్నం చేసి మేమేమీ యిల్లు కట్టుకుని వూరేగక్కర్లేదు లేమ్మా! మాకున్న దాంతో మా పిల్లల జీవితాలు చక్కదిద్ద గలిగితే మాకదే పదివేలు! చూస్తూ చూస్తూ మా సౌఖ్యం కోసమని పిల్లల నోట్లో మట్టి కొట్టలేం!" అంది.

పంకజమ్మకి యీ సారి నిజంగా చాలా బాధని పించింది! తను అంత ఓర్పు తెచ్చుకుని నచ్చజెబుతున్నా, మగపిల్ల వాడి తల్లి అయి వుండీ వాళ్ళ మంచి కోరి మీ పిల్లని యివ్వండి అని యింతలా బ్రతిమాలుతున్నా వదినగారు ఇంకా అంత మూర్ఖంగా మాట్లాడటం చూస్తే అసహ్యం కూడా వేసింది! "ఛీ వీళ్ళిలా పోతే నాకేం?!" అని పించింది.

అయినా ఆఖరి ప్రయత్నంగా మౌనంగా తమ మాటల్ని వింటున్న అన్నగారి వైపు తిరిగి, "ఏరా, అన్నయ్యా! నీ నిర్ణయమూ అంతేనా?" అంది.

గోవిందరాజు ఏదో చెప్ప బోయేడు!

ఈ లోగా సీతమ్మే మళ్ళీ రయ్యమని అందుకుంటూ, "నా పిల్లల జీవితాలు నా యిష్టం! నాకిష్టం లేకుండా దాన్ని ఎవడికైనా యిచ్చి దాని గొంతు కొయ్యాలని చూశారో, తక్షణం నుయ్యో గొయ్యో చూసుకుంటాను! అంతే!" అంది ఖరాఖండిగా.


పంకజమ్మ ఆ మాటలు వింటూనే చేతులు జోడిస్తూ, "అంత మాటెందుకులే వదినా! ఏదో అన్న పిల్లలని ఆశపడి వచ్చాను! నీ యిష్టప్రకారమే నీ పిల్లల్ని సుఖపడనీ!" అంది.

అక్కడితో ఆ సంభాషణ ముగిసింది! ఆ రాత్రికి ఎలాగో ముళ్ళ మీద వున్నట్టు గడిపిన పంకజమ్మ మర్నాడు పొద్దున్నే తిరిగి పల్లెకు వెళ్ళి పోయింది!

ఆ తర్వాత రోజులూ, సంఘటనలూ చాలా తొందరగా గడిచి పోయాయి!

పంకజమ్మ తమ పల్లెలో నే కాస్త పేద కుటుంబంలోంచి నెమ్మదస్తురాలూ, పనిపాటలు చాకచక్యంగా చెయ్యగలదీ అయిన లక్ష్మిని తన పెద్దకొడుకు శ్రీనివాస్‌కి చేసుకుంది.

గోవిందరాజు, సీతమ్మ ఏభై ఐదు వేల కట్నం యితర లాంఛనాలతో సునీతని ఒక బ్యాంక్ గుమాస్తా కిచ్చి పెళ్ళి చేసేరు. వాళ్ళకి తాతలనాటి ఆస్తిపాస్తులు కూడా వున్నాయనీ పెళ్ళి అయిన మరుక్షణం నించి నలుగురితోనూ



చెప్పుకుని మురిసి పోయింది సీతమ్మ. పెళ్ళికి వచ్చిన పంకజమ్మకి వియ్యపురాల్ని. కూతురి ఆడబడుచుల్ని పరిచయం చేసి పొంగి పోయింది!

కొన్నాళ్ళు గడిచాయి! సునీత కాపురం మేడిపండు చందంగా తయారవసాగింది! సునీత అత్తగారికి, సునీత భర్త రఘుకి ఆశ ఎక్కువే! పండగలకి పిలిచినా పిలవక పోయినా అత్తవారింటికి రావటం, ఖరీదైన బట్టలతో బాటు ఖరీదైన కోరికలు కూడా కోరి సాధించుకోవటం సాగించాడు రఘు!

సునీతకి ఏడాది తిరిగే సరికల్లా ఆడపిల్ల పుట్టింది! బాలసారె పీటలమీద వియ్యపురాలి హోదాలో పట్టు చీర పెట్టించుకోవటమే గాక, మనవరాలికి రెండు తులాల బంగారం పెట్టేదాకా వూరుకోలేదు, సునీత అత్తగారు.

పెట్టు పోతల్లో ఏమాత్రం లోపం కనిపించినా, "గొప్ప సంబంధం కావాలనుకుంటే సరా?! వియ్యమందే అర్హత వుందో లేదో చూసుకోవద్దూ!" అంటూ దెప్పి పొడిచేది.

"నన్నూ యింతేనమ్మా! మా ఆడబడుచులకి, తోటి కోడళ్ళకి నెక్లెసులు, ఉంగరాలు, గాజులు అన్నీ వున్నాయి!నాన్న నాకు కట్నం యిచ్చి, పెళ్ళయితే చేశారు గాని భారీగా నగలేం పెట్టలేదు గదా! మూసి వాయినం ముత్తైదువులా వాళ్ళింట్లో అడుగు పెట్టానని మా అత్తగారు దెప్పుతూనే వుంటుం... మా తోటి కోడళ్ల ముందు ఎంత చిన్నతనంగా వుంటుందో?! పైగా వాళ్ళంతా బి. ఎ. లూ, ఎమ్మేలూ పాసైన వాళ్ళు! నేనేమో చదువురాని మొద్దునని మా ఆయన కూడా హేళన చేస్తారు నన్ను!" చాటుగా తల్లితో చెప్పుకుని ఏడ్చేది సునీత.

ఇవన్నీ చూసీ చూసీ, వినీ వినీ, సీతమ్మ కళ్ళు తెరిపిన పడటం ప్రారంభించాయి! కూతురి అత్తవారి కోరికలు తీర్చీ తీర్చీ దిగజారి పోయిన ఆర్థిక పరిస్థితి-ఒకనాడు ఆడబడుచు చెప్పిన మాటల్లో నిజాయితీని, మంచితనాన్ని ఎత్తి చూపించసాగింది!

మరి కొన్నాళ్ళు గడిచే సరికి రఘుకి



## గోవా బాలిక వర్ష

**టి.**వి. మహాభారత్‌లో ఉత్తర పాత్ర ధారిణి వర్ష ఉసగాంవ్‌కర్ సెక్సీ రాణి కిమీకట్కర్‌కు ఏమీ తీసిపోవటం లేదట. ఆ విషయం ఫొటో చూస్తుంటేనే అర్థమై పోతోందికదూ! ఇలాంటి అందగత్తెను పెట్టి ఎన్ని చిత్రాలైనా నిర్మించవచ్చు నంటున్నారు సినీ ప్రముఖులు. అవి విజయవంతం కావటం, కాకపోవటం తర్వాత సంగతి మహారాష్ట్రకు చెందిన స్మితా పాటిల్ కూడా కలుగ జేయని ప్రభావాన్ని పరిశ్రమలో ఈ గోవా బాలిక కలుగ జేసిందంటే వింతే! మరి కిమీకి పోటీ వస్తుందేమో!

తాగటం అలవాటైందన్న వార్త తెలిసింది!

పుట్టింటికి వచ్చిన సునీత, "నేనంటే ఆయనకి ఇష్టం లేదుట! నేనేదో కాస్త ఎర్రగా బుర్రగా వున్నాననీ, నాన్న వాళ్లడిగిన కట్నం యిస్తానన్నారనీ ఒప్పుకున్నారట గానీ ఆయనకి చదువుకుని, ఉద్యోగం చేసే అమ్మాయిని చేసుకోవాలని వుండేదిట. మొదటినించీ! నన్ను ఆయన కెందుకిచ్చి పెళ్ళి చేశారమ్మా? హాయిగా బావకిచ్చి చేసి వుంటే నిశ్చింతగా వుండేదాన్ని!" అంటూ ఏడ్చింది.

సీతమ్మ తెల్లబోయింది! కూతురు సుఖపడుతుందని అనుకుంది గానీ. పెళ్ళైన నాలుగేళ్ళకి ఒక బిడ్డ పుట్టి, యింకో బిడ్డ పుట్టబోతున్న తరుణంలో అల్లుడికి యిలాంటి ఆలోచనలు వస్తాయని అనుకుందా?!

ఏమైనా తనదే తప్పు. సమానసియ్యం, సమాన కయ్యం అన్నారు! తమ స్థాయి మనుషులతో సంబంధం కలుపుకుని వుంటే కట్న కానుకల కోసం అంత పేచీలు వుండేవి కావు! అనుభవించే వాళ్ళ అదృష్టమని, తన కూతురు అదృష్ట వంతురాలైతే అది అడుగు పెట్టిన యింట లక్ష్మీ తాండవించి వుండేది!

సీతమ్మ ఆలోచనలు ఒక్కసారి మేనల్లుడు వాసువైపు మళ్ళాయి! ఉన్న వ్యవసాయంతో తృప్తి చెందక మరో యిద్దరు స్నేహితులతో కలిసి సిటీలో చిన్న వ్యాపారం మొదలు పెట్టాడు వాసు! అది మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తోంది! ఆ నాడు వాసు

చదువే తనకి కనిపించింది గాని, సంపాదించాలనే తపనా, సమర్థతా **అతడిలో** వున్నట్టు గుడ్డిదై పోయిన తన మనో నేత్రానికి తెలియలేదు!

సునీత కాపురం మరి నాలుగు రోజులు గడిస్తే చక్కబడవచ్చు! ఇద్దరు పిల్లల తల్లి అని అల్లుడు భార్యని సరిగా చూసుకోవచ్చు! కాని, మొదట్లో పడుతున్న యీ బాధలు బాధలే! యివి తన వల్లనే వచ్చాయి! తన మనశ్శాంతిని తనే పోగొట్టుకుంది! ఆలోచనలతో తల బద్దలై పోతున్నట్టు అనిపించింది సీతమ్మకి.

ఎన్నో సంవత్సరాల తర్వాత, తన ఇంటి ముందు ప్రత్యక్షమైన అన్నా వదినల్ని చూసి, ఆనందంతో పొంగిపోతూ ఆహ్వానించింది పంకజమ్మ.

మామూలు కబుర్లూ, కాఫీలూ అయిన తర్వాత, "పంకజం! యింత హఠాత్తుగా మేం ఎందుకొచ్చామా అని ఆశ్చర్య పోతున్నావా?!" అంది సీతమ్మ.

పంకజమ్మ నవ్వేస్తూ, "మీరు హఠాత్తుగా రావటం ఆశ్చర్యాన్నే కాదు, ఆనందాన్ని కూడా కలిగించింది వదినా!" అంది.

ఆడబడుచు అభిమానానికి సీతమ్మ కళ్లల్లో నీళ్లు తిరిగాయి!

## కోరి పిల్లనడిగితే...

"పంకజం! ఒకనాడు మా మంచి కోరుతున్నానని నువ్వు ఏవేవో చెబితే తీసి పారేశాను గుర్తుందా..." అంది.

"ఇప్పుడవన్నీ ఎందుకులే వదినా..." పంకజమ్మ మృదువుగా వారించ బోయింది.

"అదికాదు, నన్ను చెప్పనీ! ఆ నాటి నీ మాటల్లో నగ్నసత్యాన్ని యివేళ గ్రహించాను! కోరి వచ్చిన నిన్ను కాదని అందని ఎత్తులకి ఎగిరాను! ఈ నాడు నాకు గాని నా కూతురికి గాని సుఖమన్నది లేదంటే నమ్ము! వాళ్లంతా హై సొసైటీ! సునీత అందులో యిమడలేక పోతోంది! వాళ్లు కూడా దాన్ని నానా మాటలూ అంటున్నారు! నాకు నిజంగా తెలిసి వచ్చింది పంకజం! ఇప్పుడు నాకు అందలం ఎక్కాలని, నా పిల్లల్ని అందలాలు ఎక్కించాలనీ లేదు! నాకున్నదల్లా ఒకటే కోరిక! ఇప్పుడు పెళ్లి చెయ్యబోయే కవితైనా భర్తతో కలిసి ఆనందంగా గడపాలి! అందుకే నీ దగ్గరికి వచ్చాను! ఒకనాడు మగపిల్లవాడి తల్లివై వుండీ నన్ను అడగటానికి సంకోచించలేదు నువ్వు! ఈ రోజు ఆడపిల్ల తల్లిగా నిన్ను ప్రార్థిస్తున్నాను! నీ చిన్న కొడుకు మధుకి కవితని చేసుకో! అదైనా సుఖంగా వుంటే "నా కంతే చాలు..." చివరి మాటలు చెబుతుండగా సీతమ్మ కళ్ల వెంట నీళ్లు జలజలా రాలాయి!

చప్పున వదినగారి భుజం మీద చెయ్యి వేసి, ఓదార్పుగా నిమిరింది పంకజమ్మ.

"తప్పు వదినా, అలా బాధపడకు! నీ బాధ ఒకటీ నా బాధ ఒకటినా?! అలాగే, నువ్వన్నట్టే చేద్దాం! పిల్లలిద్దరూ ఒకరినొకరు యిష్టపడితే మాకు మాత్రం అంతకంటే కావలసిందేముంది? వాళ్లని ఒక మాట అడిగి, అలాగే చేద్దాం!" అంది.

పంకజమ్మ మాటలు వినగానే సీతమ్మ ముఖం తేటపడింది! అవసర సమయంలో ఆత్మీయురాలైన మనిషి అందించిన ఓదార్పు, గ్రీష్మం తరువాతి తొలకరి జల్లులా ఆమె మనసుని చల్లబరిచింది! ఆ తొలకరి జల్లులో, భవిష్యత్తు పట్ల ఆశలనే విత్తనాలు ఆమె మనసులో నాటుకున్నాయి! ఆ ఆశల విత్తులు మొలకెత్తి పూలు పూచి కాయలు కాచే తరుణం కోసం, ఆమె మనో నేత్రం, సుదూరానికి దృష్టి సారించింది. ○

## నిలబడితేనే వొంట బడుతుంది!

సోవియట్ దేశంలో వ్లదీవనోక్, పాఠశాల అధ్యాపకులైన వ్లదిమిర్ సిగలోవ్, నికొలాయ్ దుబినిన్‌లు పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా కొన్ని కొత్త పద్ధతులను ప్రవేశ పెట్టారు. తరగతిలో బోధన జరుగుతున్నప్పుడు విద్యార్థులు ప్రత్యేక తరహా డెస్కుల ముందు విశిష్టమైన రబ్బరు చాపలపై నుంచుని వింటారు. అందువల్ల వారు తమ మోచేతులను డెస్కులపై ఆనించాల్సిన పని ఉండదు. అవసరమైనప్పుడు డెస్కుకు తమ గుండెల నానించి నిలబడవచ్చు.

'పాఠశాలలో చదివే పదేళ్ల కాలంలో ను 26 శాతం నుండి పిల్లలలో శరీర ఆకృతికి సంబంధించిన సమస్యలు 24 శాతం మందిలో హ్రస్వదృష్టి, 14 శాతంలో గుండె-రక్తనాళ వ్యాధులు వ్యాపిస్తున్నట్లుగా పిల్లలపై జరిపిన పరిశీలనలు వెల్లడించాయి. బోధనా సమయంలో పిల్లలు దాదాపు నిశ్శబ్దంగా కూర్చుని ఉండడంవల్ల యీ లోపాలు ప్రబలుతున్నాయని భావిస్తున్నారు. వీటి నివారణకే యీ కొత్త పద్ధతిని ప్రవేశ పెట్టాం. ఇందువల్ల విద్యార్థులలో చురుకుదనం, ప్రతిస్పందన, జ్ఞాపకశక్తి గణనీయంగా పెరుగుతాయని దుబినిన్ చెప్పారు. ఈ కొత్త పద్ధతిని వ్లదీవనోక్ లోని ఒక బోర్డింగ్ పాఠశాల, మాస్కో, కీవ్‌ఖబరోవ్స్క్‌లకు చెందిన మరికొన్ని పాఠశాలలు ప్రయోగంలోకి తెచ్చాయి. జపాన్, చైనా నిపుణులు కూడా యీ పద్ధతి యెడ తమ ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు.